ప్రజాశక్తి
మంగళవారం 9 సెప్టెంబర్ 2025



మూగజీవుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -అనంతగిరి: మూగజీవులకు సోకే వ్యాధుల పట్ల సిబ్బంది ముందస్తు జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాశీపట్నం పశు వైద్య శాఖ అధికారి సాగరి. గణేశ్వరరావు తెలిపారు. సోమవారం కార్యాలయం వద్ద సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూగజీవులకు అవసరమైన టీకాలు, ఇతర మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెంపుడు కుక్కల కు టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు.గ్రామాలలో మేకలు, పశువులకు సోకే వ్యాధులను గుర్తించి అవసరమైన టీకాలను ముందుగానే రైతులకు అందించి ప్రాణాంతకమైన వ్యాధులను రక్షించాల్సిన అవసరం సిబ్బందిపై ఉందన్నారు.



మాట్లాడుతున్న పశువైద్యాధికారి

ఐటిడిఎ పిఒ శ్రీపూజ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ పిఒగా తిరుమణి శ్రీపూజను నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 3న బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో, సోమవారం ఐటిడిఎ పిఒగా శ్రీపూజ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఐటిడిఎ ఎపిఒల ఛాంబర్స్, అడ్మినిస్ట్రేటివ్ వింగ్ విభాగాలు, ఆర్ ఒఎఫ్ఆర్ సెక్షన్, టిడబ్ల్యూడిడి, డిఎంహెచ్ఒ, డిఆర్ డిఎ, హార్టికల్చర్, ఎన్ఆర్ జిఎస్, అకౌంట్ సెక్షన్ కార్యాలయాలు, మీటింగ్ హాల్ పరిశీలించారు. కార్యాలయాల్లోని ఉద్యోగులను కొత్త పిఒకు ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు పరిచయం చేశారు. ఐటిడిఎ ఎఒ హేమలత, డిఆర్డిఎ పిఒ మురళి, సిబ్బందితోపాటు పలువురు అధికారులు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. గిరిజనుల అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తానని ఈ సందర్భంగా నూతన పిఒ శ్రీపూజ పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున పిఒ శ్రీపూజ

కొత్త పిఒ ముంగిట పెను సవాళ్లు..

జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎలో పాలన కుంటుపడింది. అభివృద్ధి పడకేసింది. పరిపాలన పరమైన సమస్యలు తలెత్తాయి. వ్యవస్థలు గాడి తప్పాయి...ఈ తరుణంలో కొత్తగా వచ్చిన పిఒకు ఇవి పెను సవాళ్లు విసురుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటిడిఎ కార్యాలయ పరిపాలన ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వినిపిస్తోంది. ఇక్కడ ఐటిడిఎ పిఒగా పనిచేస్తున్న వి.అభిషేక్‌ను 9 నెలల క్రితం పోలవరం ప్రాజెక్ట్ పరిపాలనాధికారి బదిలీ చేశారు. దీంతో స్థానిక జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడకు ఐటిడిఎ పిఒ బాధ్యతలు అప్పగించారు. జెసి ఓ పక్క జిల్లా వ్యవహారాలు చూసుకుంటూనే.. మరొక అదనపు బాధ్యతలను నిర్వర్తించాల్సి రావడంతో రెండు పోస్టులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి ఐటిడిఎ పిఒ పోస్టు ఖాళీగానే ఉంది. 9 నెలలుగా పూర్తిస్థాయి పిఒ లేకపోవడంతో అభివృద్ధి పనులు, ఇతర ప్రగతి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. ఉన్నతాధికారి పర్యవేక్షణ సరిగా లేక గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఫలాలు, మెనూ అమలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందడం లేదు. గిరిజన విద్యా వ్యవస్థతో పాటు ఐటిడిఎలోని పరిపాలన పూర్తిగా గాడి తప్పాయి. దీంతో, ఏదోలా కాలం గడుపు తున్నట్టుగానే ఉంది కానీ, పాలన సాగుతున్నట్టుగా ప్రజలకు అనిపించలేదు.

ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో వైద్య ఆరోగ్య, ఎన్ఆర్ఇజిఎస్, వెలుగు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, పర్యాటక తదితర శాఖలకు సంబంధించి పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలి. పిఒ లేక అభివృద్ధి పనులు సక్రమంగా ముందుకు సాగలేదు. ఈ క్రమంలో యువ ఐఎఎస్ శ్రీపూజను ఐటిడిఎ పిఒగా నియమించడంతో గిరిజనాభివృద్ధికి బాటలు పడతాయని మన్యవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి అధికారి విధుల్లో చేరడంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.

కలెక్టర్‌ని కలిసిన రంపచోడవరం పిఒ

ప్రజాశక్తి-పాడేరు: రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సోమవారం మర్యాద పూర్వకంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. 2022 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన స్మరణ్ రాజ్ తెలంగాణ రాష్ట్రంలోని విద్యానగర్‌కు చెందినవారు. నూజివీడు సబ్ కలెక్టర్గా పనిచేస్తూ రంపచోడవరం ప్రాజెక్టు అధికారిగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా స్థానిక కాఫీ హౌస్‌లో ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహించడం తనకు చాలా తృప్తి నిస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనం 1 ఎట్టకేలకు ప్రారంభించారు. 'విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తేరూ పేరుతో ఆగస్టు నెల 27న ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి సంబదిత అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు ఆధ్వర్యంలో అరకు ఎమ్మెల్యే వేగం మత్స్యలింగం, స్థానిక జడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సరైన భవనం లేక చిన్నారులు, బాలింతలు, నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. కొత్త భవనంతో ఆ సమస్య తీరిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దురు గంగన్న దొర, నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందించడానికి స్మార్ట్ రేషన్ కార్డులు కీలకమని వైస్ ఎంపీపీ ఎస్ కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షులు శతక బొంజు బాబు స్పష్టం చేశారు. మండలంలోని రాప, గన్నేరు పుట్టు, తడతిగిరి పంచాయతీలలో స్మార్ట్ కార్డుల పంపిణీని సోమవారం చేపట్టారు.అర్హులైన ప్రతి కుటుంబం తప్పనిసరిగా స్మార్ట్ కార్డు తీసుకోవాలని, ఇకపై అన్ని రేషన్ సరఫరా వీటి ద్వారానే పొందగలరని తెలిపారు. స్మార్ట్ కార్డులు వినియోగంలోకి రావడంతో మోసాలకు అవకతవకలకు తావులేదని తెలిపారు.ప్రతి లబ్ధిదారుడు ఈ కార్డులను తీసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు.



కార్డులు పంపిణీ చేస్తున్న బొంజు బాబు

వికలాంగులు ముగ్గురు.. పింఛన్ ఒకరికే...

- ఆరుగురు పిల్లల్లో ముగ్గురికి అంగవైకల్యం
- జీవన పోరాటంలో సతమతమవుతున్న తల్లిదండ్రులు
- ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : జనసేన నేత

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని ఓ గిరిజన కుటుంబం దయనీయ స్థితిలో జీవన పోరాటం సాగిస్తోంది. ఆరుగురు సంతానంలో ముగ్గురు అంగవైకల్యం కాగా వారిలో ఒకరికే ప్రభుత్వం పింఛను రూ.6000 వస్తుంది. దీంతో ఆ కుటుంబ జీవితం కష్టతరంగా మారింది. ఈ కుటుంబ దయనీయ పరిస్థితిని జనసేన పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు కూడ రామకృష్ణ వెలుగులోకి తీసుకొచ్చారు. ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ పరిధి సిరిపురం గ్రామానికి



వికలాంగ బాలుడు



ముగ్గురు వికలాంగులు

చెందిన కిల్లో నాగేశ్వరరావు, గౌరీ దంపతులకు ఆరుగురు పిల్లలు. వారిలో ప్రవీణ్ (14), నిఖిల్ (10), శ్రావణి (7) ముగ్గురు పిల్లలు అంగవైకల్యం (పోలియో)తో బాధపడుతున్నారు. నడవడం, నిలబడడం వీరికి అసాధ్యం. వీరి వయసులోని పిల్లలు పాఠశాలకు వెళ్తుంటే వీరి కదల్లేని పరిస్థితుల్లో ఉన్నారు. వీరి ముగ్గురిలో ప్రవీణ్‌కు మాత్రం వికలాంగ పింఛన్ రూ.6000 వస్తుంది. ఇది మిగిలిన వారి పోషణకు ఏమాత్రం చాలడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఒక వైపు పిల్లలను చూసుకుంటూ మరో వైపు కుటుంబ పోషణకు ఏదో ఒక పని చేసుకోలేక ఆ తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. ఆధునిక వైద్యం ఎంతో అభివృద్ధి చెందినా మన్యం ప్రాంతంలో ఇప్పటికీ పౌష్టికాహారలోపం, వైద్య సదుపాయాల కొరత, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో చిన్నారులు అంగవైకల్యాల బారిన పడుతున్నారు.

జనసేన నాయకుడు రామకృష్ణ, కార్యకర్తలు శ్రీకాకుళం ఏసుబాబు, గెమ్మెలి సాయిబాబు, గెమ్మెలి నాయుడు, మర్రి రాజబాబు ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబ పరిస్థితిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాధిత తల్లిదండ్రులు మాట్లాడుతూ అందుతున్న ఒకే ఒక పింఛనుతో పిల్లల పోషణ కష్టమవుతుందని, ప్రస్తుత కూటమి తమను ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి సహాయం అందించేందుకు స్థానిక ప్రజలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని జనసేన నాయకులు కోరారు.

శ్రమదానంతో గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని మారుమూల పంచాయతీ బూసిపుట్టు మాజీ సర్పంచి వంతల మంగ్లన్న సోమవారం శ్రమదానంతో ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను పూడచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుత్తేదారుల నిర్లక్ష్యంతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయన్నారు.కుమ్మడా పంచాయతీ నుండి బూసిపుట్టు వెళ్లే ప్రధాన రహదారి బూరుగుమెట్ట గ్రామ సమీపంలో కల్వర్టు మొదలుకొని పూలబంధ గ్రామం వరకు గత ఏడాది నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పాటించకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. దీంతో రోడ్డు వర్షాలకు దెబ్బతిని మట్టి కొట్టుకుపోయిందన్నారు. ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించడంతో ప్రయాణికులు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామ యువకులు రాళ్లను గుంతల్లో కప్పి రోడ్డును బాగు చేశారన్నారు..కాంక్రీట్ కలిపి రోడ్డు మరమ్మతులను చేపట్టారు.



గోతుల్లో రాళ్లను వేస్తున్న మాజీ సర్పంచ్

పలు గ్రామాల్లో వైద్యశిబిరాలు

- లాగరాయి పిహెచ్‌సి పరిధిలో చికిత్స
- గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటా లార్వా సర్వే
- కింద్ర, లబ్బర్తి,లాగరాయి గ్రామాల్లో పారిశుధ్య పనులు
- బాధితులకు అధికారులు, ప్రజాప్రతినిధుల పరామర్శ
- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన



బాధితులతో మాట్లాడుతున్న అడిషనల్ డిఎంహెచ్ఒ డేవిడ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి పిహెచ్‌సి పరిధిలోని కింద్ర, లాగరాయి, లబ్బర్తి తదితర గ్రామాల్లో కొన్ని రోజులుగా ప్రజలు కీళ్లవాపులు, నొప్పులు, జ్వరాలు వంటి రోగాలతో మంచాలపై లేవలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో 'ప్రజాశక్తి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'వింత వ్యాధితో విలవిల' అనే వార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. కింద్ర,లబ్బర్తి, లాగరాయి గ్రామాల్లో అడిషనల్ డిఎంహెచ్ఒ వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడిషనల్ డిఎంహెచ్ఒ డేవిడ్ ఆధ్వర్యంలో నలుగురు వైద్యాధికారులు, ఇతర వైద్య సిబ్బంది బృందం మూడు టీములుగా వైద్యశిబిరాలు నిర్వహించారు. బాధితుల నుండి అధికారులు, ప్రజాప్రతినిధులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల వద్దకు అడిషనల్ డిఎంహెచ్ఒ డేవిడ్ నేరుగా వెళ్లి వాళ్ళ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తాము నెల రోజుల నుండి ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. చంద్ర గ్రామంలో నెలకొన్న సమస్యను అధికారులకు ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎఎంసి డైరెక్టర్ కేసిరెడ్డి శివ, కూటమి నాయకులు చిట్టిబాబు తదితరులు వైద్యులకు వివరించారు. మూడు రోజుల పాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తామని వాటిని ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారులు సూచించారు. గ్రామాల్లో ఇంటింటా తిరిగి సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టిందీ లేనిదీ పర్యవేక్షించారు. ప్రజలు పరిశుభ్రత పాటించాలని, నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, తాగునీరు క్లోరినేషన్ చేయించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. బాధితుల నుండి రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపించి వ్యాధి నిర్ధారణకై అధ్యయనం చేయడం జరుగుతుందని,బాధితులు భయపడాల్సిన అవసరం లేదని డేవిడ్ తెలిపారు. కార్యక్రమంలో మరో అడిషనల్ డిఎంహెచ్ఒ శిరీష, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, లాగరాయి లబ్బర్తి సర్పంచులు ఘనలక్ష్మి, సత్యవతి, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు,లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, ఎఎంసి డైరెక్టర్ కేసిరెడ్డి శివ, వైద్యాధికారులు సతీష్, శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో వైద్య శిబిరాలు :ఎఎంసి చైర్మన్ లక్ష్మణరావు

లాగరాయి పిహెచ్‌సి పరిధిలో లబ్బర్తి, లాగరాయి,కింద్ర గ్రామాలలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు, తెలుగు యువత అధ్యక్షులు ఎం.విజయయభాస్కర్ చొరవతో అడిషనల్ డిఎంహెచ్ఒ డేవిడ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారని వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ లోతాలక్ష్మణరావు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు కూటమి నేతలు తెలిపారు. మెరుగైన చికిత్సకు కాకినాడ, రాజమండ్రి, రంపచోడవరం తీసుకెళ్లి వైద్యం చేయించాలని అడిషనల్ డిఎంహెచ్ఒను వైద్యులను కోరారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి త్వరలో ఈ గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజవొమ్మంగి పిహెచ్‌సిలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని అడిషనల్ డిఎంహెచ్ఒ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ లక్ష్మణరావు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-రంపచోడవరం : అగ్నిప్రమాద బాధితుల అన్ని విధాలా ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే ఎం శిరీష దేవి అన్నారు. మండలంలో చీడిపాలెం, నిమ్మలపాలెం, ఇసుకపట్ల గ్రామాల్లో ఆమె సోమవారం పర్యటించారు. తొలుత ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్లుకాలిపోయి సర్వం నష్టపోయిన బాధితులైన మడకం సూర్య కూమరి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.అనంతరం బలిజ నాగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం,నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేసి బాధితుకు పక్కాగృహాలు త్వరగా మంజూరు చేయాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇసుకపట్లలో ఇటీవల మృతి చెందిన విద్యార్థి వింజెల వారి తల్లిదండ్రులు సత్తిబాబు, బాపనమ్మలను పరామర్శించి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మారేడుమిల్లి మండలంలో ఇటీవల మృతి చెందిన గొందివాడ విద్యార్థిని చెదల దివ్యతేజ తల్లిదండ్రులు చెదల ధర్మారెడ్డి,వెంకట లక్ష్మిలను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయా కుటుంబాలకు చెరో రూ25,000ల చొప్పున నగదు సాయం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు విజయ్‌భాస్కర్, ఎస్టి కమిషన్ మెంబర్ సునీత, ఎఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, మండలపార్టీ కార్యదర్శి కె.నాగన్న పాల్గొన్నారు.

గంబుషియా చేపలతో దోమల నివారణ

ప్రజాశక్తి - గంగవరం: గంబుషియా చేపలతో దోమల నివారణ సాధ్యమవుతుందని వైద్యాధికారి భావన తెలిపారు. గంబూషియా చేపలు దోమల లార్వా తింటాయని తద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. గంగవరం పిహెచ్‌సి పిడతమామిడి పరిధిలో ఉన్న గ్రామాలకు జిల్లా మలేరియా అధికారి ద్వారా ఈ చేపలను చెరువులో వేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆరోగ్యఅధికారి నిహిత, ఎస్‌యుఒ సూరిబాబు పాల్గొన్నారు.

దేవీపట్నం: దోమల నియంత్రణకు గంబూషియా చేపలు సహజ మార్గమని వైద్యాధికారి క్రాంతిసౌజన్య తెలిపారు. ఈ చేపలను చెరువులు, బావులు, నీటినిల్వ ట్యాంకులు, మురుగు కాల్వల్లో వదలడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చు అన్నారు.



చెరువులో చేపలు వేస్తున్న అధికారులు

విద్యుత్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-ఎటపాక: విద్యుత్‌షాక్‌కు గురై విధి నిర్వహణలో ఉన్న ఎనర్జీ అసిస్టెంట్ మృతి చెందాడు. బొజ్జిగుప్ప గ్రామానికి చెందిన ముర్రం నాగార్జున (34) గుండాల సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం వెంకటరెడ్డిపేట పంచాయతీ పరిధిలో విద్యుత్ లైనుపై విరిగిపడిన వేపకొమ్మను తొలగించే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే తోటి సిబ్బంది అతన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.



నాగార్జున (ఫైల్ ఫొటో)

రైతు సేవాకేంద్రాల్లో ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని రేఖపల్లిలో రైతుసేవా కేంద్రాల్లో సోమవారం ఎంపిపి కారం లక్ష్మి, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టిలక్ష్మి ఎరువులు పంపిణీ చేశారు. ములకనపల్లి కుందులూరు పంచాయతీలకు చెందిన రైతులకు యూరియా అందించారు. వరదల కారణంగా ములకనపల్లి కేంద్రానికి వెళ్లాల్సిన యూరియా లోడు రహదారి లేని కారణంగా రేఖపల్లిలో దించారు. ఆయా గ్రామస్తులు ఇక్కడికి వచ్చి తీసుకున్నారు. ఎంపిపి కారంలక్ష్మి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ మీద వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని కోరారు. అన్నవరం ఉమ్మడివరం గ్రామాల మధ్య బ్రిడ్జి కూలిపోయిందని తక్షణమే తాత్కాలిక వంతెన నిర్మాణం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. అగ్రికల్చర్ ఆఫీసర్, సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, గుండెపోడి లక్ష్మణరావు, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని పెద్దార్కూర్ గ్రామంలో రైతులకు ఎరువులు స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి అమ్మాజి సోమవారం ప్రారంభించారు. ఎఒ పాల్గొన్నారు. సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ ఎరువులు ఆలస్యంగా వచ్చాయని, ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఎంపిటిసి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో ఎరువులు అందిస్తున్న సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి అమ్మాజీ

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : రేషన్ పారదర్శకంగా అమలు చేయాలన్న ధ్యేయంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఎం.శిరీషదేవి విజయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద తహసీల్దార్ బాలాజీ అధ్యక్షతన సోమవారం స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణి చేశారు. ఎస్టీ కమిషన్ మెంబర్ సునీత, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు సచివాలయంలో వినియోగదారులకి స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ నిర్వహించారు. ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, ఉపసర్పంచ్ వల్లిప్రసాద్ అర్హులకు అందజేశారు.



సీలేరులో కార్డులు ఇస్తున్న ఎంపిటిసి సాంబమూర్తి



హెచ్ఎం విశ్వరాజ్ ఆధ్వర్యంలో అక్షరాస్యత దినోత్సవం

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముసురుమిల్లి సర్పంచ్ కోసు రమేష్‌బాబు, ఎంపిటిసి కుంజం వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకునిఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన గడిపే విశ్వరాజ్‌ని ముసురుమిల్లి స్కూల్‌లో పనిచేస్తున్న రాజన్నదొరని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సేంద్రీయ పద్ధతిలో సాగు చేయాలి



మాట్లాడుతున్న ఎఒ సుధాకర్

ప్రజాశక్తి-హుకుంపేట: రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ సూచించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో గ్రామసభలు నిర్వహించారు. సోమవారం హుకుంపేట పంచాయితి పరిధి డి.చింతలవీధి జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా అధికంగా వాడటంతో పంటలు నష్టపోతాయన్నారు. 'అధికంగా యూరియా వేస్తే పంట ఆకులు పచ్చగా మెరిసి, గింజలు రాకపోవడం, దిగుబడి తీవ్రంగా తగ్గిపోవడం జరుగుతుందన్నారు.వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయని సూచించారు.అధికంతో యూరియా వాడకంతో కీటకాలు విపరీతంగా పెరిగి పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. రైతులు తక్షణమే యూరియా వాడకాన్ని నియంత్రించకపోతే, భూమి నాశనం అవుతుందన్నారు. సేంద్రీయ ఎరువులతో మంచి దిగుబడి సాధ్యమన్నారు.

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 10న జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు పి పరశురాం పిలుపునిచ్చారు. మండలంలోని గుంటసీమ పంచాయితీ గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎరువులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడే ఎరువులను పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కొంతమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధిక సంఖ్యలో అన్నదాతలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, సర్పంచ్ జి నాగేశ్వరరావు, మండల కార్యదర్శులు ఏ.ఎం.శంకర్, విజయదశమి, కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. మండల అధ్యక్షులుగా సొలబం సింహాచలం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సరమండ. ధనుంజయ్, ఉపాధ్యక్షులుగా మోస్య, రవి, మాసాడి. శ్రీనివాస్, కోరాబు నాగమణి, కార్యదర్శులుగా ఉగ్రెంగి ధర్మారావు, వండ్లబు సత్యనారాయణ నాయుడు, విజయకుమార్, కళ్యాణి, జిల్లా కౌన్సిలర్స్ గా కోరాబు.రంజన్ కుమార్, రామచంద్రుడులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి శెట్టి శాంతకుమారి, జిల్లా అధ్యక్షులు రావుల జగన్ మోహనరావు పరిశీలకులుగా వ్యవహరించారు.

విఒఎల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని ఇస్తున్న విఒఎలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: విఒఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి, కె శంకర్ రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వెలుగు విఓఏల సమావేశ మందిరం వద్ద సోమవారం సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు సమావేశాన్ని నిర్వహించారు. విఓఎల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విఓఏలు ఎన్నో ఏళ్ల నుండి కష్టపడి విధులు నిర్వహిస్తున్నా వారి కష్టాన్ని గత ప్రభుత్వాలు, నేటి కూటమి సర్కార్ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి విఓఏల న్యాయమైన సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26000 చెల్లిస్తూ, కాళ్ల పరిమితి సర్క్యులర్ ని రద్దు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, బకాయి వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో విఓఏల నూతన మండల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి, సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. అధ్యక్షురాలు టి దుర్గాదేవి, కార్యదర్శిగా పి పద్మనాభం, ట్రెజరరీగా ఏం మను మాధవ్, సభ్యులుగా కె జగన్, కే కమల, పి సావిత్రి, ఎస్ జ్యోతి, రాజారావు, పి గణపతి, పి సుబ్బారావు, పి.గౌతమ, కే.ప్రశాంత్ ఎన్నికయ్యారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, వివోఎల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కే త్రినాథ్, అధ్యక్షులు పి భీమరాజు, విఓఏలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై నివేదికలు సిద్ధం చేయండి

ప్రజాశక్తి-పాడేరు: పెండింగ్లో ఉన్న ఎం.పి.ఎఫ్.సి గోదాము నిర్మాణ పనులపై నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఐటిడిఎ పాడేరు, రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు, డిసిఒ, మార్కెటింగ్ డిఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా నేటి వరకు చేపట్టిన పనులపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరు కాబడిన 42 ఎం.పి.ఎఫ్.సి గోదాములకు గాను నేటికీ ఇంకా పూర్తి కాని 12 బేస్మెంట్ నిర్మాణ పనులు, నేటికీ పూర్తిగా ప్రారంభం కానీ 6 నిర్మాణ పనులు ప్రారంభించడానికి కావలసిన వెసులుబాటు ఉన్నదీ, లేనిది ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు పరిశీలించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు సమగ్ర గిరిజన వృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారులు తిరుమణి శ్రీపూజ, స్మరణ్ రాజ్, అపూర్వ భరద్వాజ్, డిసిఒ ఎం.వి. రామకృష్ణ రాజు, మార్కెటింగ్ శాఖ డిఈ, ఏఈలు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

గిరిజన మహిళా సంఘం మహాసభ



మాట్లాడుతున్న జయ

ప్రజాశక్తి- అనంతగిరి: మండల కేంద్రంలో గిరిజన సంఘం కార్యాలయంలో స్వాబి.కాసులమ్మ అధ్యక్షతన గిరిజన మహిళ సంఘం రెండవ మహసభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.విజయ పాల్గొన్నారు సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, దేశం, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. మహిళాలు ఐక్యంగా ఉండి జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఎదిరించి పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. మహిళా హక్కుల అమలుకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.అనంతరం దీసరి. దేముడమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మహిళల హక్కులు అమలు చేసే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు.

అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. సంఘంగా అధ్యక్షులుగా స్వాబి.కాసులమ్మ, కార్యదర్శిగా దీసరి.దేముడమ్మ, కోశాధికారిగా సోమెల.రూతు, కమిటీ సభ్యులుగా 12 మంది ఎన్నిక అయ్యారు.

అంగన్వాడీల యూనియన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్బి పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి కే.కొండమ్మ ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడి కార్మికుల సంఘం నూతన మండల కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా టీ సత్యవతి, అధ్యక్షురాలుగా పాంగి రాధ, ప్రధాన కార్యదర్శిగా జి.పవిత్రలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు మాట్లాడుతూ, అంగన్వాడి కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంగన్వాడి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్మికులు పాల్గొన్నారు.



పాంగి రాధ, అధ్యక్షురాలు



జి పవిత్ర కార్యదర్శి

విఒఎ జిల్లా అధ్యక్షుడిగా భాస్కరరావు



భాస్కరరావు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వెలుగు యానిమేటర్ల సంఘం (విఒఎ) జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలానికి చెందిన కె భాస్కరరావు, మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరులో యానిమేటర్ల సంఘం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

105 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి : అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. చింతపల్లి సీఐ ఎం.వినోద్ బాబు, ఎస్సై జి.వీరబాబుకు అందిన సమాచారం మేరకు ప్రత్యేక దళం ఏర్పాటు చేసి, ఒడిశా రాళ్లగడ్డ నుండి లోతుగడ్డ బ్రిడ్జి వైపుకు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. సదరు నిందితుల వద్ద నుంచి 3 గోనె సంచుల్లో సుమారు 105 కిలోల గంజాం



నిందితులతో పోలీసులు

మద్దిగరువును మండల కేంద్రంగా ప్రకటించాలి



ర్యాలీ చేపడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -జిమాడుగుల: మద్దిగరువు మండలం కావాలని అంటూ గ్రామ ప్రజలు సోమవారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మద్దిగరువు మండలం ఏర్పడితే విద్య, వైద్యం, రోడ్డు వంటివి అభివృద్ధి చెందుతాయన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వ సాయం అందేనా?

ప్రజాశక్తి - విఆర్పురం: ఇటీవల వరదలతో ఇబ్బంది పడుతున్న ముంపు బాధితులకు ప్రభుత్వం ఇంతవరకూ తక్షణ సహాయం ప్రకటించకపోవడంతో బాధిత గ్రామస్తులు సాయం ఎప్పుడు అందిస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇళ్లలోకి నీరు చేరి గుట్టలపై గుడారాలు వేసుకుని వాహనాలపై సామాన్లు తరలించుకుని వెళ్లి వరద తగ్గాక మళ్లీ ఇళ్లకు తెచ్చుకోవడానికి ఇళ్లు శుభ్రం చేసుకునే క్రమంలో నానా అవస్థలు పడ్డామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.




తహసీల్దార్కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ అధ్యక్షులు జగదీష్దొర తదితరులు

'ఉచిత బస్సుతో మా ఉపాధి పోతోంది'

దేవీపట్నం -ప్రజాశక్తి: దేవీపట్నం మండలంలోని ఆటో డ్రైవర్లు స్త్రీశక్తి పథకం వల్ల తాము రోజువారీ ఆదాయం కోల్పోయామని రోడ్డున పడ్డామని వాపోయారు. సోమవారం దేవీపట్నం యూనియన్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు నిరసన చేపట్టారు. యూనియన్ అధ్యక్షులు తుర్రం జగదీష్దొర మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకం వల్ల కార్మికులందరూ ఉపాధి కోల్పోయారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి, ప్రతీ ఆటో డ్రైవర్ కుటుంబానికి నెలకు రూ. 25,000 ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్కు వినతిపత్రం అందించారు.

ఆశ్రమ పాఠశాల పక్కనే మురుగు

ప్రజాశక్తి -చింతూరు: చింతూరు డివిజన్లోని ఎర్రంపేట రహదారి పక్కనే గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రహరీని ఆనుకుని మురుగునీరు నిలిచిపోయింది. గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికల ఎస్ఎంఎస్ హాస్టల్ను ఆనుకుని మురుగునీరు ఉంది. కనీసం డ్రైనేజీ ఏర్పాటు చేసినా మురుగు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉండేది. గుర్రపు డెక్క ఆకు కూడా ఈ గోడని ఆనుకుని వ్యాపించి ఉంది. అధికారులు స్పందించి గుర్రపు డెక్క ఆకును తొలగించి డ్రైనేజీను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎరువుల దుకాణల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: జడ్డంగి ప్రాంతంలోని ఎరువుల దుకాణాలను రంపచోడవరం డిఎస్పి సాయిప్రశాంత్ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, యూరియా నిల్వ పరిశీలించారు. యూరియా స్టాక్ వివరాలను ప్రతిరోజు రిజిస్టర్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజవొమ్మంగి సిఐ గౌరీశంకర్, జడ్డంగి ఎస్ఐ చినబాబు ఉన్నారు.

ప్రిన్సిపాల్కు ఘన సన్మానం

ప్రజాశక్తి -చింతూరు: చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత, ప్రిన్సిపాల్ కొండ్రు రమేష్బాబును కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ప్రిన్సిపాల్ సేవలను కొనియాడారు. రమేష్బాబు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ రమేష్బాబును శాలువాతో ఘనంగా సన్మానించారు.



రమేష్బాబును సన్మానిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం నుండి ఏజెన్సీని కలిపి రహదారి వేయాలి

- కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్కు లోతా రామారావు వినతి
- నిధులు విడుదల కాగానే పనులు పూర్తి : కలెక్టర్ హామీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: కాకినాడ జిల్లా ఏలేశ్వరం నుండి ఏజెన్సీ ప్రాంతంలో రాజఒమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం మండలాల గ్రామాలను కలిపే ఆర్ అండ్బి రహదారి నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ ఏజెన్సీలో సుమారు 365 గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితిలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా నిధులు రావాల్సి ఉందని, నిధులు విడుదల కాగానే రహదారి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాకినాడ ఆర్అండ్బి సూపరింటెండెంట్ను కూడా లోతా రామారావు కలిసి మాట్లాడారు. నిధులు మంజూరు కాగానే రహదారి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



కలెక్టర్కు సమస్య వివరిస్తున్న లోతా రామారావు

నిధులు రావడానికి మరో ఐదేళ్లు పడుతుందని ఉద్యమంతోనే రోడ్డు సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని లోతా రామారావు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ప్రజాసంఘాల నాయకులు పలివెల వీరబాబు,సూరిబాబు తదితరులు ఉన్నారు



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి అరుణ్కుమార్

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-జికెవీధి : గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి అరుణ్కుమార్ అన్నారు. రింతాడ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆదికర్మయోగి యోజన కార్యక్రమంలో భాగంగా ఉపసర్పంచ్ సోమేశ్కుమార్ అధ్యక్షతన ఎఒ గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి అరుణ్కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆదికర్మయోగి యోజనలో ఎంపికైన రింతాడ, ఆసరాడ బొడ్డమానువీధి, కడుగుల గ్రామాల్లో కనీస సౌకర్యాలు మెరుగుపరచడానికి గ్రామసభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. ఎఒ గిరిబాబు మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత రాకుండా ఈనెల 12వ తేదీ నుంచి రింతాడ రైతుసేవా కేంద్రంలో కూడా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాఫీ రైతులు బెరీబోరర్ తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు.

ముంపు బాధితులకు వైసిపి పరామర్శ

ప్రజాశక్తి - విఆర్పురం : వైసిపి చేపట్టిన 'చంద్రబాబు ష్యూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు మండలంలోని ముంపునకు గురైన గ్రామాలను సోమవారం సందర్శించారు. అనంతరం విఆర్పురం మండలం రేకపల్లిలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు బనాయించేందుకు టిడిపి నాయకులు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపి, కూనవరం జెడ్పిటిసి, జిల్లా బిసి అధ్యక్షులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పి4 తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి- విఆర్ పురం: పి4 తక్షణమే అమలు చేయాలని ఎంపిడిఒ ఇమాన్యుయెల్ అధికారులను ఆదేశించారు. రేకపల్లి పంచాయతీలో ఎంపిడిఒ సమావేశ మందిరంలో సోమవారం తహసీల్దార్ వై. సరస్వతి, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్, స్మార్ట్కార్డ్స్ పంపిణి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, రేకపల్లి కార్యదర్శి దుర్గాప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.



వినతులు తీసుకుంటున్న ఎపిఒ జనరల్ రమణ

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు71 అర్జీలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారం సుమారు 71 అర్జీలు రావడం జరిగిందని ఆయన తెలిపారు.

పర్యాటకానికి మరింత వన్నె తెచ్చేందుకు వియత్నాంతో ఒప్పందం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :

ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగానికి మరింత వన్నె తెచ్చేందుకు వియత్నాంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్పెషల్ సి.ఎస్ అజయ్ జైన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ట్రావెల్స్ ఏజెన్సీ ప్రతినిధుల సహకారంతో వియత్నం ప్రధానమంత్రి అడ్వైజరీ బాడీ అసోసియేషన్ మెంబర్, వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఛైర్మన్, చౌట్రీయంగ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. వియత్నాంలో ఉన్న టూరిస్టులు బుద్ధిజంకు సంబంధించి బుద్ధగయ తదితర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్లో కూడా అమరావతి కాలచక్రం, ఉమ్మడి విశాఖ జిల్లాలో బొజ్జన్నకొండ, బావికొండ, తొట్లకొండ తదితర ప్రాంతాలను సందర్శించేందుకు వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఛైర్మన్ చౌట్రీయంగ్, స్పెషల్ సిఎస్ అజయ్జైన్ ఎంఒయు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఛైర్మన్, చౌ ట్రీయంగ్ను స్పెషల్ సిఎస్ అజయ్జైన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శాలువతో సత్కరించారు. టూరిజం శాఖాధికారులు మాధవి, జగదీష్, ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో పలు ప్రాంతాలతో పాటు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత వాన కురిసింది. అప్పటివరకు కాస్త ఎండ కాసినప్పటికీ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం పడడంతో జనజీవనానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. గంటసేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగునీరు ప్రవహించింది.

గంగవరం: గంగవరం మండల కేంద్రంలో సోమవారం మూడు గంటల ప్రాంతంలో ప్రారంభమైన వర్షం సుమారు మూడు గంటల పాటు కురిసింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి సెయింట్ ఆన్స్ హైస్కూల్లో మాదక ద్రవ్యాలపై 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ టీమ్ ఇన్స్పెక్టర్ ఎస్.నారాయణరావు, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ సెయింట్ మెరిన్గీత మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, నిల్వ, సహకారం చేసిన వారిపై ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సంబంధిత సమాచారం ఏదైనా ఉంటే 1972 టోల్ ఫ్రీ నెంబర్కు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. సైబర్ క్రైమ్కు సంబంధించి సమాచారం 1930 టోల్ ఫ్రీ నెంబర్కు తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

పలువురికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చింతపల్లి : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు పర్యవేక్షణలో చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో మెగా కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎంపికైన 50 మందిని విశాఖపట్నం ఎన్నారై హాస్పిటల్కు శస్త్ర చికిత్సల నిమిత్తం పంపించారు. ఉచితంగా సర్జరీ చేయిస్తామని డాక్టర్ అనూష తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- హుకుంపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. పారిశుద్ధ్యం పాటిస్తేనే గ్రామం ఆరోగ్యవంతంగా మారుతుందని, ప్రతి ఇంటి వద్ద స్వచ్ఛత ఉండేలా చూడాలని ఆయన సూచించారు. గ్రామాలలో పారిశుద్ధ్యం కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. వీధిలో ఏర్పాటు చేసిన డస్ట్బిన్లలోనే చెత్త వేయాలని సూచించారు.